ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
విజయనగరం
జిల్లా వార్తలు
శుక్రవారం 5 సెప్టెంబరు 2025



పైడిమాంబ ఆలయాల హుండీ లెక్కింపు

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పైడిమాంబ ఆలయాలకు సంబంధించి చదురుగుడి, వనంగుడి హుండీలను గురువారం దేవదాయశాఖ సహాయ కమిషనర్, పైడిమాంబ ఆలయ ఇన్‌చార్జి ఈవో కె.శిరీష పర్యవేక్షణలో లెక్కించారు. చదురుగుడి హుండీలో రూ. 15,62,461, బంగారం 12గ్రాముల 350 మిల్లీగ్రాములు, వెండి 216 గ్రాములు, వనంగుడి హుండీలో నగదు 3,64,803, అన్నదానం కింద 8,750 నగదు వచ్చినట్లు ఈవోతెలిపారు. ఆలయ సూపరింటెండెంట్ వై.వెంకటరమణి పాల్గొన్నారు.

అవార్డుల మాస్టార్లు

ఈ మాస్టార్లు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు. బోధనలో వినూత్న పద్ధతులు అవలంబిస్తున్నారు. తద్వారా రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు అందుకుంటున్నారు. నిరంతర కృషితో పాటు ప్రత్యేక శ్రద్ధ వహించడం వల్లే తమకు ఈ గుర్తింపు దక్కిందని రావాడ జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ డైరెక్టర్) నచ్చిరెడ్డి సూర్యనారాయణ, పారసాం హెచ్ఎం సిద్ధాంతం త్రినాథరావు, అలుగోలు జడ్పీ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసిన జీఎస్ కాంతారావు అంటున్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వీరు విజయవాడలో అవార్డులు అందుకోనున్నారు.

- నిరంతర కృషి.. ప్రత్యేక శ్రద్ధే వీరి విజయ రహస్యం
- విద్యార్థులను తీర్చిదిద్దడానికి వినూత్న పద్ధతులు
- జిల్లా నుంచి ముగ్గురికి రాష్ట్ర ఉత్తమ అవార్డులు



వినూత్న రీతిలో పాఠాలు బోధిస్తున్న హెచ్ఎం త్రినాథరావు

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- పారసాం హెచ్ఎం సిద్ధాంతం త్రినాథరావు

నెల్లిమర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పారసాం హెచ్ఎం సిద్ధాంతం త్రినాథరావు తెలిపారు. 1989లో ఉద్యోగంలో చేరిన నుంచి వృత్తినే దైవంగా భావిస్తూ పనిచేస్తున్నానని చెప్పారు. తొలుత ఎస్‌జీటీ చేరిన తర్వాత గణిత ఉపాధ్యాయుడిగా పనిచేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు పొందడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని, పిల్లలను ఉత్తమ పౌరులగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు.

వీడియోలను తయారుచేసి.. శిక్షణ ఇచ్చి

గణితంలో విద్యార్థులు సులువుగా (మిగతా 5వ పేజీలో..)

నేడు కలెక్టరేట్‌లో గురుపూజోత్సవం

- 76 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో మాజీ రాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధకృష్ణన్ జయంతి పురస్కరించుకుని జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో 76 మందిని ఉత్తమ ఉపాధ్యాయలుగా ఎంపిక చేశామని, వారిని సన్మానించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొంటారని పేర్కొన్నారు.

వేసవి సెలవుల్లోనూ శిక్షణ

- రావాడ జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ సూర్యనారాయణ

భోగాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లోనూ శిక్షణ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు రావాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ డైరెక్టర్)గా విధులు నిర్వహిస్తున్న నచ్చిరెడ్డి సూర్యనారాయణ తెలిపారు. విద్యార్థులకు వేసవిసెలవుల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో వారు క్రీడల్లో రాణించడం వల్ల రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యానని సూర్యనారాయణ పేర్కొన్నారు. అవార్డు లభించడంతో ఉద్యోగం పొందిన రోజు కంటే ఎక్కువ ఆనందంగా ఉందని తెలిపారు. ఉద్యోగం పొందినప్పటి నుంచి ఉద్యోగ ధర్మంలో భాగంగా క్రీడాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతూ వారు పొందిన పతకాలతో ఆనందం పొందేవాడినని చెప్పారు. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని చెప్పారు.



పతకాలు పొందిన విద్యార్థులతో సూర్యనారాయణ

ఇదీ ఉద్యోగం నేపథ్యం..

వేపాడ మండలంలోని నీలకంఠరాజపురానికి చెందిన సూర్యనారాయణ విద్యాభ్యాసం దేవరాపల్లి, విశాఖ ఆంధ్రా యూనివర్సిటీలో కొనసాగింది. బీపీ ఎంఏ, ఎంఏ, ఎంకాం, బీపీఈడీ చదువుకున్నారు. 2009 డీఎస్సీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఆయన మెరకముడిదాం మండలంలోని శాతవలస స్కూల్‌లో చేరి 2011 వరకూ (మిగతా 5వ పేజీలో..)

అవార్డు కష్టాన్ని మరిచిపోయేలా చేసింది

- పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు కాంతారావు



నెల్లిమర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పలు శిక్షణలకు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించినట్లు పదవీ విరమణ పొందిన హెచ్ఎం కాంతారావు తెలిపారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తాను పడిన కష్టాన్ని మరచిపోయేలా చేసిందని చెప్పారు.

గణిత బోధకులకు శిక్షణ..

అలుగోలు జడ్పీ పాఠశాలలో హెచ్ఎం పనిచేసి పదవీవిరమణ పొందిన జీఎస్ కాంతారావు డీపీఈపీలో నాలుగేళ్లుగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో రిసోర్సుపర్సన్‌గా వ్యవహరించారు. పలు శిక్షణ మాడ్యుల్స్ రచనల్లో పాల్గొని సుమారు 150 నుంచి 200 పైచిలుక ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణల్లో శిక్షణ ఇచ్చి వివిధ వీడియో, టెలీ కాన్ఫరెన్స్‌ల్లో పాల్గొన్నారు. ఆర్ఎంఎస్ఏలో రాష్ట్రస్థాయిలో గణితంపై రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. వివిధ జిల్లాలకు చెందిన అనేక మంది ఉపాధ్యాయులకు గణిత బోధనపై శిక్షణ ఇచ్చారు. 2011లో ఇన్‌స్పైర్ పోటీల్లో క్యూబింగ్ ట్రిపుల్ అన్న మోడల్‌కు జాతీయస్థాయి బహుమతి లభించగా, ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనడానికి అనుమతి లభించింది.

డీఎస్సీ ప్రశ్నపత్రాల తయారీకి ఎంపిక

జిల్లాస్థాయిలో 2011లో పేపర్ ప్రెజెంటేషన్‌తో పాటు అదే ఏడాది (మిగతా 5వ పేజీలో..)

నాడు హింసపెట్టి.. ఇప్పుడు నిరసనలా?

- వైసీపీవి డైవర్షన్ పాలిటిక్స్ ● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

విజయనగరం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రైతులను హింస పెట్టి, ఇప్పుడేమో నిరసనలకు పిలుపు నివ్వడం శోచనీయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పాలనలో విత్తనాలు, ఎరువులు ఇవ్వలేని వైసీపీ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. ప్రజల్లో ప్రభుత్వం పట్ల సంతృప్తి వ్యక్తమవుతుండ డాన్ని ఓర్వలేక వైసీపీ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారన్నారు. వీటి కారణం గానే ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదన్నారు. తమ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుందన్నారు. ఎరువులను రైతులకు అవసరమైన మేర అందించేందుకు కృషి చేస్తున్నదన్నారు.

నూతన బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025-28 సంవత్సరానికి తీసుకువచ్చిన నూతన బార్ పాలసీని అనుసరించి దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో 11 బార్లకు లైసెన్సు ఫీజు రూ.55 లక్షల చొప్పున, బొబ్బిలిలో ఒక బార్‌కు రూ55లక్షలు, రాజాంలో మూడు బార్లకు రూ.35 లక్షల చొప్పున, పార్వతీపురం-మన్యం జిల్లాలోని పార్వతీపురంలో 3 బార్లకు రూ.55 లక్షల చొప్పున, సాలూరులో ఒక బార్‌కు రూ.35 లక్షలు తిరిగి నోటిపై చేసినట్టు తెలిపారు. వీటిని ఈ వేలం ద్వారా ఎంపిక చేస్తారని, ఆసక్తి గలవారు నాన్ రిఫండబుల్ ఫీజు రూ.5 లక్షలతో పాటు రూ.10వేలు ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాలని కోరారు. పూర్తి వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ కార్యాలయంతో పాటు నగరంలోని ఎక్సైజ్ టౌన్ పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 94409 02360, 94409 02362 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

ఒక్కొక్కటిగా..!



ఎస్.కోట మండలం కిల్తంపాలెం పరిధిలో నిర్మించిన జిందాల్ తాత్కాలిక కార్యాలయం

- నిర్వాసితు సమస్యల పరిష్కారానికి అడుగులు
- ప్రత్యేక దృష్టిసారించిన జిల్లా అధికార యంత్రాంగం
- షేర్లు, ఉద్యోగాల కోసం అధికశాతం వినతులు
- అక్టోబరులో ఎంఎస్ఎంఈల స్థాపనకు భూమిపూజ?

జిందాల్ భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం శృంగవరపుకోట మండలం మూలబొడ్డవర సచివాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామసభకు 198 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 110 మంది కంపెనీ ఇచ్చిన హామీ మేరకు షేర్లు, ఉద్యోగాలు కావాలని విన్నవించారు. 52 మంది మౌలిక సదుపాయాల కల్పన కోసం ఆర్ఆర్ ప్యాకేజీ అడిగారు. 20 మంది నష్టపరిహారం మరింత పెంచాలని కోరారు. 16 మంది మాత్రం వ్యవసాయం చేసుకునేందుకు తిరిగి భూములను ఇచ్చేయాలని వినతి చేశారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు గురువారం నివేదిక పంపినట్లు తెలిసింది.

శృంగవరపుకోట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి)

జిందాల్ భూనిర్వాసితుల సమస్యల పరిష్కారానికి జిల్లా అధికార యంత్రాంగం చొరవ చూపుతోంది. భూ సమస్యలు ఉన్న రైతులు ఎందరు? ఏఏ సమస్యలు ఉన్నాయి? అన్న అంశాలపై దృష్టి సారించింది. ఇప్పటికే అధికారులు గతంలో నష్టపరిహారం తీసుకోని వారితో పాటు పీవోటీ (చేతులు మారిన భూములకు చెందిన వారిని) గుర్తించారు. అర్హులైన వారికి తక్షణం పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. చట్టపరంగా పీవోటీలకు పరిహారం ఇవ్వడం కుదరక పోయినా వారికి న్యాయం చేసేందుకు ఉన్న అవకాశాలను వెదుకుతున్నారు. తమకు తెలియకుండానే జిందాల్ యాజమాన్యం భూములను రిజిస్ట్రేషన్ చేసేసుకుందంటూ వచ్చిన ఫిర్యాదులను కూడా విచారిస్తున్నారు. ప్రతి సమస్యను నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. జిందాల్ భూముల్లో పారిశ్రామికీకరణకు మార్గం సుగమమం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. అంతా అనుకూలిస్తే అక్టోబరు 15 నాటికి ఎంఎస్ఎంఈ పార్కుల భూమిపూజకు సీఎం చంద్రబాబు నాయుడు వచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

జిందాల్ వద్ద 1166 ఎకరాలు..

జిందాల్ యాజమాన్యం వద్ద 1166.43 ఎకరాల భూమి వుంది. ఈ భూమిని శృంగవరపుకోట మండలం కిల్తంపాలెం, ముషిడిపల్లి, చీడిపాలెం, చినఖండేపల్లి మూల బొడ్డవర గ్రామాల రైతుల నుంచి సేకరించారు. 2007 జూన్ 28న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అల్యూమినియం శుద్ధి కర్మాగారం (రిఫైనరీ, విద్యుత్ పవర్ ప్లాంట్) నిర్మాణానికి జేఎస్‌డబ్ల్యూ అల్యూమినియం (జిందాల్) లిమిటెడ్‌కు అప్పగించింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందుకు అవసరమగు బాక్సైట్ ఖనిజాన్ని ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు, అనంతగిరి కొండల నుంచి తవ్వుకునేందుకు అనుమతులు ఇవ్వాలని చూసింది. అయితే ఆయా ప్రాంతాల గిరిజనుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఇంతలో రాష్ట్ర (మిగతా 5వ పేజీలో..)

డీజే సౌండ్స్‌కు కుప్పకూలి..



హరీష్ (ఫైల్)

విజయనగరం క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బొబ్బాదిపేటకు చెందిన హరీష్ (22) డీజే సౌండ్స్‌కు కుప్పకూలి మృతి చెందారు. బుధవారం రాత్రి వినాయక నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా డీజే సౌండ్స్‌కు హరీష్ నృత్యం చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. అక్కడున్న వారు వెంటనే అతడ్ని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. డిగ్రీపూర్తి చేసిన హరీష్ త్వరలో పోటీ పరీక్షల కోచింగ్ నిమిత్తం హైదరాబాదు వెళ్లేందుకు రిజర్వేషన్ చేయించుకున్నారు. హరీష్ మృతితో బొబ్బాదిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. డీజే సౌండ్స్ నిషేధించకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

వరదొస్తే వణుకే!

- ఐదు గ్రామాల ప్రజల భయాందోళన ● చంపావతిపై వంతెన నిర్మాణమే పరిష్కారం



మర్రివలస వద్ద చంపావతిని దాటేందుకు సాహసం చేస్తున్న ఉద్యోగులు



అంగన్‌వాడీ కేంద్రానికి గుడ్లు తరలిస్తున్న ఏజెన్సీ నిర్వాహకుడు

గజపతినగరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రివలస మీదుగా వెళ్లే ఐదు గ్రామాల ప్రజలు చంపావతి నది ఉధృతంగా ప్రవహిస్తే సాహసించాల్సి వస్తోంది. ఆ సమయంలో ఐదు గ్రామాల ప్రజలు ప్రాణాలను ఫణంగా పెట్టి నదిని దాటాల్సివస్తోంది. లేకపోతే వర్షాకాలంలో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. నిత్యావసర సరుకులకు సైతం ఇబ్బందిపడాల్సి వస్తోంది. ఐదు గ్రామాల్లో సుమారు 1200 మంది జీవిస్తున్నారు. ప్రతి పనికి కూడా గజపతినగరం రావల్సివస్తోంది. ప్రస్తుతం నదిలో వరద పెరగడంతో నిత్యావసర సరుకులు సైతం అందడంలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ప్రవాహం పెరిగితే..

మండలంలోని మర్రివలస, సరాయివలస, సిగడంవలప, రావివలస, యర్రగుడ్ల గ్రామాల ప్రజలు మర్రివలస వద్ద చంపావతి నదిని దాటి ఆయా గ్రామాలకు చేరుకోవల్సిఉంది. ఇక్కడ వంతెన లేకపోవడంతో ఐదు గ్రామాల ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు సాహసించి నదిలో దిగి దాటాల్సి వస్తోంది. ప్రస్తుతం నదీ పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రవాహం పెరిగింది. దీంతో కొద్దిరోజులుగా నదిని దాటలేని వారికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అత్యవసర సమయంలో 108 వాహనం కూడా రాని పరిస్థితి నెలకొంది.

వైసీపీ హయాంలో కాలయాపన

టీడీపీ హయాంలో గతంలో 2014-19లో మర్రివలస వద్ద మినీ వంతెన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయడు ప్రతిపాదనలు చేశారు. దీంతో అప్పటి మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా 5.20 కోట్లు మంజూరుచేశారు. ఎన్నికలు (మిగతా 5వ పేజీలో..)

విజయనగరంలో త్రీటౌన్ స్టేషన్!

- అక్టోబరు నాటికి ఏర్పాటయ్యే అవకాశం
- ఇతర పోలీసుస్టేషన్లపై తగ్గనున్న భారం

విజయనగరం క్రైం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విజయనగరం త్రీ టౌన్ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు మార్గం సుగమమైనట్టే. రెండు దశాబ్దాలుగా ఈ ప్రతిపాదన ఉన్నా ఆచరణకు నోచుకోలేదు. ప్రభుత్వాలు మారుతున్నా త్రీటౌన్ పోలీసు స్టేషన్ కలగానే మిగిలిపోయింది. గత దశాబ్దకాలంగా విజయనగరంలో జనాభా విపరీతంగా పెరిగింది. ప్రస్తుత 3 లక్షలు దాటింది. క్రైం రేటు కూడా పెరుగుతోంది. సెలెక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ స్థాయి నుంచి నగరపాలక సంస్థ స్థాయికి ఎదిగిన విజయనగరంలో.. పేరుగాంచిన హోటల్స్, ఆసుపత్రులు, ఇతర వాణిజ్య సముదాయాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం విజయనగరంలో వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీసుస్టేషన్లు ఉన్నాయి. విజయనగరం మండల పరిధిలోని గ్రామాలు, నగర శివారు గ్రామాలు రూరల్ పరిధిలోకి రాగా.. విజయనగరం వన్‌టౌన్ పరిధిలో నగరంలో కొంత భాగం, టూటౌన్ పరిధిలో మరికొంత భాగం ఉన్నాయి. దీంతో ఈ రెండు పోలీసుస్టేషన్లపై భారం విపరీతంగా పెరిగింది. దీంతో సీఐ స్థాయి నుంచి క్షేత్రస్థాయి పోలీసు వరకూ ఇబ్బందిపడే పరిస్థితి. ఎవరినైనా స్టేషన్‌కు తీసుకుని రావాలంటే దాదాపు గంట సమయం పడుతున్నది. ఈ నేపథ్యంలో త్రీటౌన్ పోలీసుస్టేషన్ ప్రతిపాదన ఎమ్మెల్యే అదితి గజపతిరాజు.. హోంమంత్రి అనిత, దృష్టికి తీసుకుని వచ్చారు. హోం మంత్రి వెంటనే సుముఖత వ్యక్తం చేయడంతో త్రీటౌన్ స్టేషన్‌కు మోక్షం లభించినట్టయింది. అన్నీ సవ్యంగా సాగితే అక్టోబరు నాటికి త్రీ టౌన్ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది. జిల్లా పోలీసు యంత్రాంగం కూడా నగరంలోని కేఎల్ పురం ప్రాంతంలో ఈ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసింది.

ప్రతిపాదనలు పంపాం: ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరంలో ఇప్పుడున్న వన్‌టౌన్, టూటౌన్, రూరల్ (మిగతా 5వ పేజీలో..)

హైవేలపై ప్రమాదాలను అరికడతాం

- ఎస్పీ వకుల్ జిందాల్



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

భోగాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన భోగాపురం పోలీస్‌స్టేషన్‌కు గురువారం వచ్చి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలు జరగడానికి కారణాలు గుర్తించాలన్నారు. నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తునకు సీసీ కెమెరాలు చాలా ముఖ్యమని, వీలైనన్ని కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మండలంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు అవుతుండడంతో పటిష్ఠమైన భద్రత ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐ దుర్గాప్రసాద్ రావు, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, ఎస్ఐలు పాపారావు, సూర్యకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

గజపతినగరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ గజపతినగరం సమితి జనరల్ సెక్రటరీ పురం అప్పారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులకు గురి కావల్సి వస్తోందన్నారు. అనంతరం తహసీల్దార్ బి.రత్నకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

జేఎన్‌టీయూతో నాస్కమ్ ఒప్పందం

విజయనగరం రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీలో ఉన్న నాస్కమ్ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. గురువారం యూనివర్సిటీ వీసీ డి.రాజ్యలక్ష్మి పాల్గొని పరస్పర ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. వీసీ రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జయసుమ, నాస్కమ్ డైరక్టర్ ఉదయ్‌శంకర్, ప్రవీణ్‌తో పాటు కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. జేఎన్‌టీయూ పరిధిలో ఉన్న అన్ని స్వయం ప్రతిపత్తి కళాశాలలు, అనుబంధ కళాశాలల నియామక అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేమూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయం

విజయనగరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యాత్రికులతో భారత గౌరవ్ స్పెషల్ రైల్లో పంచజ్యోతిర్లింగ క్షేత్రాలు, మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, భీమ్‌శంకర్, ఘృష్ణేశ్వర్ దర్శనం కలిగిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేమూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన జాతీయ అధ్యక్షుడు జంధ్యాల బుచ్చిబాబు కొనియాడారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ యాత్రకు ఒక్కొక్కరికి రూ.23 వేలు చొప్పున సంస్థ తరఫున 12 మందికి ఫౌండేషన్ వ్యయం చేసిందని తెలిపారు.

రామేశ్వరి కాలనీలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

గరివిడి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామేశ్వరి కాలనీలో వినాయక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు మూడు వేలమంది భక్తులు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు వాకాడ గోపీ, పి.కుమార్, వడ్రంగి రమేష్, నీలాద్రి సూర్యనారాయణ, తూట శ్రీను పాల్గొన్నారు.

మందుల కొరత రానీయకండి

చీపురుపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో మందుల కొరత రానీయకుండా చూడాలని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ సూచించారు. కర్లాం పీహెచ్‌సీలో గురువారం జరిగిన ఆసుపత్రి సలహా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షా కాలం కారణంగా గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు శ్రీలక్ష్మి, కృష్ణ, సర్పంచ్ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం చేయాలి

భోగాపురం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేయడాన్ని ప్రతిఒక్కరూ కుటుంబ సంప్రదాయంగా పాటించాలని మోపాడ ఆప్తాల్మిక్ అధికారి మజ్జి గణపతిరావు సూచించారు. నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా భోగాపురంలో విజయనగరం అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులకు ఏటా సుమారు 2లక్షల కార్నియాలు అవసరం అవుతుండగా కేవలం 50 వేలు మాత్రమే సేకరిస్తున్నామని చెప్పారు.

రూ.50వేలు పలికిన గణేష్ లడ్డూ

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీతారాంపురంలో వినాయక నవరాత్రుల్లో భాగంగా గురువారం లడ్డూ వేలం పాట నిర్వహించగా, అదే గ్రామానికి చెందిన రెడ్డి చిన్నికృష్ణ అనే రైతు తన సహచర రైతులతో కలిసి రూ.50వేలకు దక్కించుకున్నారు. సర్పంచ్ చిన్నంనాయుడు లడ్డూ అందించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

దత్తిరాజేరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పెదమానాపురం సంతతోటలో ఉన్న కొల్లా నరసింహస్వామి సన్స్ ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్ సీఐ బి.సింహాచలం గురువారం తనిఖీ చేశారు. రికార్డులను, స్టాకును పరిశీలించారు. రైతులకు ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని, అంతకు మించి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవో అనూరాధ ఉన్నారు.

నాణ్యమైన బోధన అందివ్వాలి

రేగిడి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందివ్వాలని ఎంఈవోలు వరప్రసాదరావు, బి.ఎరకయ్యలు ఉపాధ్యాయులకు సూచించారు. లింగాలవలస ప్రాథమిక పాఠశాలను వారు ఇతర ఉపాధ్యాయుల బృందంతో కలిసి గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, వర్క్‌బుక్ నిర్వహణ, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టులు.. తప్పని కష్టాలు

- రహదారులపై ప్రవహిస్తున్న నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

గంట్యాడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం, చంద్రంపేట గ్రామాలకు వెళ్లే రహదారిలో ఉన్న కల్వర్టులు కుంగిపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. గతంలో ఇక్కడి కల్వర్టులు మూసుకుపోయాయి. ఈ కారణంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారులపై నుంచి నీరు ప్రవహిస్తోంది. సిరిపురం నుంచి మురపాక, పెదవేమలి గ్రామాలకు వెళ్లే రహదారిలో ఉన్న కల్వర్టు పూర్తిగా మూసుకుపోయింది. ఇటీవల తమ చెరువు సాగునీరు తమ పొలాలకు రావడం లేదని కింద ఉన్న ఆయకట్టు రైతులు ఈ మూసుకుపోయిన కల్వర్టు వద్ద యంత్రాలతో తవ్వారు. దీంతో సిరిపురం గ్రామానికి సరఫరా అయిన తాగునీటి పైపులు దెబ్బతిన్నాయి. అలాగే రోడ్డు కూడా దెబ్బతిన్నది. దీంతో మురపాక, పెదవేమలి గ్రామాలకు వెళ్లడానికి ప్రయాణికులు చాలా ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉంటే చంద్రంపేట గ్రామం వద్ద కల్వర్టు కూడా దెబ్బతిన్నది. దీంతో రహదారిపై నుంచి నీరు వెళ్లాల్సి వచ్చింది. ఈ సమస్య వల్ల గ్రామస్థులు చాలా ఇబ్బంది పడ్డారు. ఆర్అండ్‌బీ అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సిరిపురంలో మూసుకుపోయిన కల్వర్టు వద్ద తవ్విన దృశ్యం



చంద్రంపేట వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

మరుగుదొడ్ల నిర్మాణం వేగవంతం చేయండి

- కలెక్టర్ బీఆర్ అంబేద్కర్

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ సంక్షేమ వసతి గృహాలకు ఈ నెలాఖరు నాటికి మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా సంక్షేమ వసతి గృహాలకు మరుగుదొడ్ల సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 15 సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలకు మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉందన్నారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా 39 వసతి గృహాలకు మరుగుదొడ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న 149 హాస్టళ్లలో ఎన్ని చోట్ల మరుగుదొడ్ల అవసరం ఉన్నాయో గుర్తించేందుకు సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, సోషల్ వెల్ఫేర్ డీడీ అన్నపూర్ణ, బీసీ సంక్షేమ అధికారి జ్యోతిశ్రీ, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపుపై దృష్టి

రాష్ట్రమంతటా భూగర్భ జలాలు పెంపొందించే దిశగా సీఎం కృషి చేస్తున్నారని.. అందుకు అనుగుణంగా కలెక్టర్లు దృష్టి సారించాలని సీఎస్ విజయానంద్ ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ఆయన మాట్లాడారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 215 గ్రామాల్లో చెరువులు, కల్వర్టుల మరమ్మతులకు త్వరితగతిన ప్రణాళిక తయారు చేయాలన్నారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని డ్వామా పీడీ, నీటి పారుదల అధికారులను ఆదేశించారు. జిల్లాలో రోజుకు 100 చెరువుల నిర్దేశించుకొని పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని సీఎస్‌కు వివరించారు. ఈ సమావేశంలో జేసీ సేతు మాధవన్, సీపీవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ఏ క్షణంలో కూలిపోతుందో..

- శిథిలావస్థలో ఎంపీడీవో కార్యాలయం



శ్లాబు నుంచి పెచ్చులూడిన దృశ్యం

గుర్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుర్ల మండల పరిషత్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడి రాలిపోతున్నాయి. వర్షా కాలంలో శ్లాబు నుంచి నీటి చుక్కలు కారుతునే ఉంటాయి. ఈగలు, దోమలతోపాటు పాములు కూడా సంచరిస్తున్నాయి. అధికారులు లోపలికి వెళ్లాలంటే గుండె గుబేలుమంటుంది. ఏ క్షణం కూలిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు, నాయకులు తమ కుర్చీల మీద కుర్చుంటే పెచ్చులు రాలుతున్నాయి. పలుమార్లు మరమ్మతులు చేయించినా భవనం శిథిలావస్థకు చేరుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నూతన భవనం ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న వీణ కచేరీ



వీణ కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం బాబామెట్ట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో గురువారం నిర్వహించిన సంగీత కచేరీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. విద్యార్థినులు గౌతమి, గ్రీష్మా, సుమతి, మంగా పలు గీతాలను వీణపై పలికించగా, వెంకటరావు మృదంగంపై వాయిద్య సహకారం అందించారు. అనంతరం చాగంటి రమ్య పలు గీతాలు ఆలపించగా, వయోలిన్‌పై రామచరణ్, మృదంగంపై ఏడుకొండలు వాయిద్య సహకారం అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.మండపాక నాగలక్ష్మి, సిబ్బంది, ఉపాధ్యాయులు, సిబ్బంది, కళాభిమానులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభను విజయవంతం చేయండి

లక్కవరపుకోట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజాంలో ఈనెల 7, 8 తేదీలలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయు నేతలు గాడి అప్పారావు, తరిని వెంకటరమణ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పోస్టర్ విడుదల చేశారు.

ప్రభుత్వం మారినా.. పేర్లు మారలే

- వెల్నెస్ కేంద్రాలపై ఇంకా వైఎస్సార్ పేరు

గజపతినగరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన భవనాలపై ఉన్న నాటి పేర్లు మాత్రం అలాగే ఉన్నాయి. గత వైసీపీ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్ భారత్ హెల్త్‌అండ్ వెల్నెస్ వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లీనిక్ భారత్ నిర్మాణ్ సేవా కేంద్రం, రైతు భరోసా కేంద్రాల పేరుతో భవనాలను నిర్మించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్ పేరులో వైఎస్సార్ పేరును తొలగించి విలేజ్ హెల్త్‌క్లినిక్‌గా మార్పు చేశారు. అలాగే రైతుభరోసా పేరును మార్చి రైతుసేవా కేంద్రాలుగా మార్చింది. అయితే కొన్ని చోట్ల ఈ భవనాలపైన ఉన్న పేర్లు, జగన్ ఫొటోలను నేటికీ తొలగించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆయా భవనాలపై పేరు మార్పుతో పాటు మాజీ ముఖ్యమంత్రి ఫొటోలను తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఎం.కొత్తవలసలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం



జగన్ ఫోటోతో దర్శనమిస్తున్న ఆర్‌బీకే

జమ్మాదేవిపేట ఎంజేపీ పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు

లక్కవరపుకోట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జమ్మాదేవిపేట వద్దగల మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో సూపర్ స్కూల్‌గా గుర్తింపు లభించింది. ఈ పాఠశాల 2024-25 పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా 13 ఐఐఐటీ సీట్లు సాధించింది. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందాయి. అలాగే ఉపాధ్యాయిని జి.స్వప్నప్రియ లైబ్రరీని ఉత్తమంగా తీర్చిదిద్ది విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడడంతో ఆమెకు సూపర్ టీచర్ అవార్డు దక్కింది. వీటన్నింటి ఆధారంగా పాఠశాలకు 'ఎ' కేటగిరి ప్రకటించారు. ఈమేరకు బీసీ వెల్ఫేర్ రాష్ట్ర కార్యదర్శి పి.మాధవీలత చేతులమీదుగా గురువారం విజయవాడలో సూపర్ స్కూల్ అవార్డును అందజేశారు. అవార్డు రావడం పట్ల ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో హర్షం వ్యక్తం చేశారు.

జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.దేవి మాధవి అన్నారు. సింహగిరి పారా మెడికల్ కళాశాలలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ప్రభుత్వ వైద్య కళాశాల హెచ్‌వోడీ డా.బ సుమిత్రదాస్, డా.జి.ప్రేమ్‌కుమార్, కళాశాల గౌరవ అధ్యక్షుడు ప్రకాష్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ దేవి మాధవి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వంగర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వంగర సబ్‌స్టేషన్ మడ్డువలస ఫీడర్‌లోని 11కేవీలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మడ్డువలస, అరసాడ, బాగెమ్మపేట, జగన్నాథవలస, పటువర్ధనం, శ్రీహరిపురం గ్రామాలకు సరఫరా ఉండదని చెప్పారు. ● డెంకాడ: మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ జి.సురేష్ బాబు తెలిపారు. మన్యం, గొలగాం, గంట్లాం, ఎస్సీ కాలనీ, డి.తాళ్లవలస, టి.కళ్లాలు, అక్కివరం తదితర గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ● లక్కవరపుకోట: ఎల్.కోట సబ్ స్టేషన్ నిర్వహణ కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్జాం, కల్లెంపూడి, ఎల్‌కే ఎస్.పురం, ఓబలయ్యపాలెం, ముకుందపురం, ఎల్.కోట, ఖాసాపేట, తలారి, కొట్యాడ, కూర్మవరం, రంగరాయపురం, సంతపేట గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు.

డ్రోన్ల పంపిణీ

వంగర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులు తమ వ్యవసాయంలో సాంకేతికత జోడిస్తే ఆర్థికంగా ప్రగతి సాధించగలరని ఏవో కన్నబాబు అన్నారు. గురువారం రాజులగుమ్మడ గ్రామంలో రైతులకు రైతుమిత్ర సంఘాల ద్వారా ఆయన డ్రోన్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీపై బ్యాంకులు ఇస్తున్న డ్రోన్లు వినియోగించుకోవాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణతో సరిపెట్టకండి

- కొనసాగుతున్న జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్ సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బొడ్డవరలో రెండు రోజుల కిందట నిర్వహించిన గ్రామసభ కేవలం వినతుల స్వీకరణ సభగా కాకుండా సమస్యల పరిష్కార సభగా మార్చాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. గురువారం తమ 73వ రోజు నిరసనలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ పాల్గొని, మాట్లాడారు. ఈ గ్రామసభలో మెజార్టీ రైతులు తమ భూములు ఇప్పించాలని కోరుతున్నారని రైతుల భూములు వారికే ఇప్పించాలనీ కోరారు. ఒక తరం నాశనంచేసిన జిందాల్‌కు శతకోటి దండాలు అంటూ నమస్కారాలుచేశారు.

ఢిల్లీ నుంచి వచ్చిన నోటీసుల ఫలితమే..

బొడ్డవర గ్రామంలో రెండు రోజుల కిందట నిర్వహించిన గ్రామసభ తామ పోరాట ఫలితమే అని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కొద్దిరోజుల కిందట ఢిల్లీ వెళ్లి జాతీయ హ్యూమన్ రైట్స్, ఎస్సీ, ఎస్టీ కమిషన్, వినియోగదారుల ఫోరం చైర్మన్‌ల ను కలిసి ఇక్కడ జరుగుతున్న పరిణామాలు వివరిం చామన్నారు. అక్కడ ఆదేశాలతో గ్రామసభ నిర్వహించినట్టు భావిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా స్పందించిన అధికారులకు ధన్యవాదాలని అన్నారు.



భూములు ఇచ్చి నష్టపోయామని దండాలు పెడుతున్న నిర్వాసితులు

వ్యాను ఢీకొని యువకుడి మృతి

- ఇద్దరికి గాయాలు

బొండపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బొండపల్లి గ్రామంలో పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానిక ఎస్ఐ యు.మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మక్కువ మండలం వెంకటభైరిపురం గ్రామానికి చెందిన దాసరి సాయి(20), ఆకుల రాజేష్, నడిపల్లి రఘు అనే ముగ్గురు యువకులు విజయనగరం నుంచి తమ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ సాయి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ యు.మహేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని ఒకరు..

లక్కవరపుకోట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగరాయపురం జంక్షన్ సమీపంలో బైకు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో బైకిస్టు అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. వేపాడ మండలం చామలాపల్లి గ్రామానికి చెందిన పెద్దాడ అర్జునరావు(32) విశాఖ జిల్లా చినముసిడివాడలో భార్య, కుమారునితో కలిసి నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రికి తమ స్వగ్రామంలోని వినాయక నిమజ్జనం కార్యక్రమానికి హాజరు కావడానికి విశాఖ నుంచి వస్తున్నాడు. ఎల్.కోట మండలం రంగరాయపురం జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ ఘటనపై ఎస్ఐ నవీన్‌పడాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'స్వర్ణాంధ్ర'కు సహకరించండి

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నూతనంగా కొనుగోలు చేసిన పారిశుధ్య వాహనాలను ఆమె ప్రారంభించారు. ఒక ఎక్సకవేటర్, ఎనిమిది ట్రాక్టర్లు, రెండు కాంపాక్టర్ వాహనాలను ప్రారంభించి, వినియోగంలోకి తీసుకవచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ3.57 కోట్లతో పారిశుధ్య వాహనాలను సమకూర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ నల్లనయ్య, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, ఈఈ ప్రసాద్, డీఈలు, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.



పారిశుధ్య వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

నమూనాలు ల్యాబ్‌కు పంపించాం

- కోళ్లకు సోకిన వ్యాధి నిర్ధారణపై పరిశోధనలు
- పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ దామోదరరావు

కొత్తవలస, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోళ్ల మృతి చెందడానికి గల కారణాలపై నమూనాలు సేకరించి విజయవాడలోని ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించినట్లు పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.దామోదరరావు తెలిపారు. ప్రస్తుతం కోళ్ల మృతికి సంబంధించి ఎటువంటి వ్యాధి సోకిందన్న విషయం ఇంకా నిర్ధారణ కాలేదని చెప్పారు. ఇటీవల అంతు చిక్కని వ్యాధితో కొత్తవలస పౌల్ట్రీ జోన్‌లోని కొత్తవలస, లక్కవరపుకోట మండలాలతోపాటు మరికొన్ని మండలాల్లో లక్షల సంఖ్యలో కోళ్లు మృతి చెందిన విషయం విదితమే. ఈనేపథ్యంలోగురువారం కొత్తవలసలోని ఏడీ కార్యాలయంలో దామోదరరావు విలేకరులతో మాట్లాడారు. ల్యాబ్ నుంచి పరీక్షలకు సంబంధించిన నివేదికలు ఇంకా రాకపోవడంతో గ్రామాల్లో ప్రజలు తమ ఇళ్ల వద్ద పెంచుతున్న కోళ్లకు సంబంధించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కోళ్లను బయటకు విడిచిపెట్టవద్దని సూచించారు. కోళ్లతోపాటు పక్షి జాతులు చనిపోతే గ్రామానికి దూరంగా గోతులు తీసి ఖననంచేయాలని, ఎక్కడపడితే అక్కడ పారవేయవద్దని సూచించారు. కోళ్ల ఫారాల్లో ప్రతి రోజూ సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని, రెండు మూడు నెలల వరకు కోళ్ల పెంపకం నిలిపివేయడం శ్రేయస్కరమన్నారు. కోళ్ల పెంపకందారులు కూడా కరోనా సమయంలో శానిటైజ్ చేసుకోవడం వంటి తీసుకున్న జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కోళ్లఫారాల్లోకి వెళ్లే ముందు, వచ్చే ముందుకు శరీరమంతా శానిటైజ్ చేసుకోవాలని తెలిపారు. చనిపోయిన కోళ్లను ఖననం చేసిన తర్వాత కూడా శానిటైజ్ చేసుకోవాలన్నారు. కోళ్లకు సోకిన వ్యాధి ఎక్కడ నుంచి ఎలా వచ్చిందన్న విషయంపై నిర్ధారణకు పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కొత్తవలస ఏడీ కన్నంనాయుడుతో పాటు వివిధ పశువైద్యశాలల వైద్యాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామోదరరావు

సైబర్ మోసాలపై అప్రమత్తం

కొత్తవలస, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు సైబర్ మోసాలు పెరిగిపోతున్నందున ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరక్టర్ (కార్పొరేట్ సెంటర్, ముంబయి) సత్యేంద్ర కుమార్ సింగ్ అన్నారు. గురువారం దేశపాత్రునిపాలెం సమీపంలో ఒక కల్యాణమండపంలో మండలంలోని వివిధ మహిళా సంఘాలతో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్‌లకు అనుమానస్పద లింక్‌లు వస్తే ఎట్టి పరిస్థితులలోను క్లిక్ చేయొద్దని సూచన చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐకి చెందిన డిప్యూటీ జనరల్ మేనేజర్ సంక్రిత్య, రీజనల్ మేనేజర్ సురేష్‌బాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణమూర్తి, కొత్తవలస బ్రాంచి మేనేజర్ టి.శ్రీనివాస్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కె.శ్రీదేవి, ఏపీఎం వెంకటరమణ, సీసీలు నాయుడు, స్వామి, పద్మ, 300 మంది మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోండి

గుర్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని గరివిడి ఐసీడీఎస్ పీవో ఆరుద్ర అన్నారు. గురువారం కెల్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆమె బాలికలకు, గర్భిణులకు, మహిళలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వన్ స్టాప్ సెంటర్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, సఖీ నివాస్, శక్తి సదన్, 181 ఉమెన్ హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. సీడీపీవో ఎస్.ఆరుద్ర, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ ఎల్.సుజాత, సీపీ పి.సాయి విజయలక్ష్మి, సఖి సిబ్బంది పాల్గొన్నారు

అవార్డుల మాస్టార్లు

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

(మూడో పేజీ తరువాయి)

నేర్చుకునేందుకు ఎనిమిదేళ్లుగా 1200లకుపైగా వీడియోలను తయారు చేసి యూట్యూబ్ చానల్‌లో ఉంచారు. ఉపాధ్యాయులు తమ సబ్జెక్ట్‌లో ఈ కంటెంట్ వీడియో తయారుచేసుకునేలా ఉపాధ్యాయులకుఆన్‌లైన్ క్లాసులు కూడా ఇచ్చారు. డిజిటల్ వీడియోలు తయారుచేసే క్రమంలో ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 15కిపైగా వర్క్‌షాపుల్లో పాల్గొన్నారు. అక్కడఉపాధ్యాయులకు పవర్‌పాయింట్‌ప్రెజెంటేషన్‌పై ఎస్‌ఆర్‌పీ హోదాలో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్, ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. మూడు సంవత్సరాల్లో 16 మంది ట్రిపుల్ ఐటీ, 25 మంది విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లు రావడానికి కృషి చేశారు. గణిత టీచర్‌గా ఉన్న సమయంలో సైన్స్ కాంగ్రెస్‌లో రెండు సైన్స్ ప్రాజెక్టులు జాతీయస్థాయికి, ఐదు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి వెళ్లాయి. గత రెండు సంవత్సరాల్లో కౌశల్ క్విజ్‌లో విద్యార్థులు రెండుసార్లు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులకు లీడర్ షిప్ ట్రైనింగ్, సాఫ్ట్ ట్రైనింగ్స్ నిర్వహణకు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. విజనయగరం లోగోను 2018లోనే తయారుచేసి నేటికీ ఆ లోగోనే ప్రధాన కూడళ్లలో ప్రదర్శిస్తున్నారు. హెచ్‌ఎం త్రినాథ రావు సేవలు గుర్తించి కలెక్టర్లు, డీఈవోలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పలుసార్లు సన్మానించారు.

అవార్డు కష్టాన్ని మరిచిపోయేలా చేసింది

(మూడో పేజీ తరువాయి)

ఎస్‌సీఈఆర్‌టీలో ఎయిమ్ అంశంపై పేపరు ప్రెజెంటేషన్ ఇచ్చారు. కాంతారావు చెన్నైలో జరిగిన 2012 సదరన్ స్థాయి కార్యక్రమానికి ఎంపికయ్యారు.. 2013లో ఫ్లోటోనిక్ సాలిడ్స్‌అన్న అంశంపై జిల్లాస్థాయిలో , 2014లో ఫోర్త్ డైమెన్షన్ అన్న అంశంపై 3డీ గ్రాఫికల్ రిప్రజెంటేషన్ అనే అంశంపై రాష్ట్రస్థాయిలో ప్రదర్శనకు ఎంపికయ్యారు. 2014 డీఎస్సీ, టెట్‌కమ్‌డీఎస్సీకి ఆరు రకాల ఉద్యోగాలకు ప్రశ్నపత్రాలు తయారుచేసేందుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయులకు ఇండక్షన్ ట్రైనింగ్ శిక్షణ కరదీపిక తయారు చేశారు. అలాగే పలు డీఎస్సీలకు ప్రశ్నపత్రాల తయారీలో శిక్షణలో పాల్గొన్నారు. 2020లో గణితం పాఠ్యపుస్తకరచన, 2023లో ఎస్‌జీడీలకు తెలుగు అకాడమీ, ఎస్‌ఏ, టెట్ పుస్తక రచన, 2024 లో తెలుగు అకాడమీ డీఎస్సీకి సంబంధించి మరో పుస్తక రచనలో కూడా పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లోనూ శిక్షణ

(మూడో పేజీ తరువాయి)

విధులు నిర్వహించారు. తర్వాత భోగాపురం మండలంలోని రావాడ హైస్కూల్‌లో 2017వరకుపనిచేశారు.తర్వాత 2019 వరకు తూడె హైస్కూల్‌లోవిధులు నిర్వహించారు. ఉద్యోగోన్నతిపై పీడీగా 2023 వరకు గరివిడి మండలంలోని వెదురువలస స్కూల్‌లో విధులు నిర్వహించారు. అనంతరం బదిలీపై మళ్లీ భోగాపురం మండలంలోని రావాడ హైస్కూల్‌లో జూన్ 2023 చేరి, ప్రస్తుతం ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ

పని చేసిన పాఠశాలల్లో అక్కడ క్రీడా స్థలాల్లో విద్యార్థులకు సూర్యనారాయణ ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. క్రీడల్లో రాణించే విధంగా ప్రతి రోజూ సాయంత్రం స్కూల్ అవర్ తరువాత నాలుగు నుంచి ఆరు గంటల వరకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. వేసవి సెలవుల్లో సమ్మర్ శిక్షణ క్యాంపులు నిర్వహించేవారు.వాలీబాల్, బేస్‌బాల్,సాఫ్ట్‌బాల్ , మోడ్రన్ పెంథాలన్, లేజర్ రన్, బయాథ్లిన్, ట్రాక్షైన్ విభాగాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. ఈయన శిక్షణలో 2009 నుంచి 2025 వరకు 268 మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించారు. వాలీబాల్, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్, మోడ్రన్‌పెంథాలన్, లేజర్ రన్, బయాథ్లిన్, ట్రాక్షైన్ విభాగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సుమారు 40 బంగారు పతకాలు, 42 సిల్వర్, 82 బ్రాంజ్ పతకాలు సాధించారు. ఈ ఏడాది జూలై, ఆగస్టుల్లో రావాడ హైస్కూల్ విద్యార్థులు మోడ్రన్ పెంథాలన్‌లో రాష్ట్ర స్థాయిలో 14 గోల్డ్ మెడల్స్ సాధించగా, వీరిలో ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికై బీహార్‌లో నిర్వహించే జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనున్నారు.

ఒక్కటొక్కటిగా..!

(మూడో పేజీ తరువాయి)

విభజన జరిగి విభజిత ఏపీలో టీడీపీ అధికారం చేపట్టింది. గిరిజనుల మనోభావాలకు అనుగుణంగా ఖనిజ తవ్వకాలను నిషేధించింది. దీన్ని సాకుగా చూపిన జిందాల్ యాజమాన్యం ఇంతవరకు ఈ భూముల్లో పరిశ్రమలను నిర్మించలేదు. అయితే ఏడాదిన్నర క్రితం అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం వద్ద జిందాల్ యాజమాన్యం ప్రతిపాదిత పరిశ్రమ కాకుండా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చింది. అప్పటికే ఈ భూముల్లో ఈ పరిశ్రమల కోసం అనుమతులు తీసుకుని ఉన్నందున కూటమి ప్రభుత్వం సమ్మతించింది.

ఎన్నికలప్పుడు చంద్రబాబు హామీ..

సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి ఈ ప్రాంతానికి వచ్చిన నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్. యువతకు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మాట ఇచ్చారు. పక్కనున్న విశాఖ మహానగరానికి దీటుగా పారిశ్రామికీకరణ ప్రోత్సహిస్తామన్నారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేగా కోళ్ల లలిత కుమారిని గెలిపించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా వీరిద్దరూ గెలిచారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చింది. ఇప్పటికే కొత్తవలస మండలంలో ఎంఎస్‌ఎంఈ పార్కుల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఖాళీగా ఉన్న జిందాల్ భూముల్లో కూడా సుమారు రూ.3.970 కోట్లతో పది రకాల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నిర్మాణం చేపట్టి 45వేల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్ణయించింది. ఇందుకు పరిశ్రమ యాజమాన్యం భూములును చదును చేయడంతో నిర్వాసితుల నుంచి వ్యతిరేకత వచ్చింది. అప్పట్లో జిందాల్ యాజమాన్యం తమకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు, షేర్లు ఇవ్వకపోవడంతో పాటు ఇతర మౌలిక సదుపాయాల ఆర్‌ఆర్ ప్యాకేజీలను అమలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని, భూములను వ్యవసాయం చేసకునేందుకు తిరిగి ఇవ్వాలని నిర్వాసితులు 74రోజులుగా ఆందోళన చేస్తున్నారు. నిర్వాసితుల నుంచి వినిపిస్తున్న డిమాండ్లు, గ్రీవెన్స్‌లకు అనుగుణంగా కలెక్టర్ విచారణ చేయిస్తూనే.. సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. జిందాల్ నిర్వాసితుల వినతులను తెలుసుకునేందుకు గతంలో తహసీల్దార్ కార్యాలయంలో కేఆర్‌సీసీ ప్రత్యేక ఉప కలెక్టర్ ఇ.మురళీతో గ్రీవెన్స్ ఏర్పాటు చేయించారు. అప్పుడు 11 మంది మాత్రమే దరఖాస్తులు ఇచ్చారు. తిరిగి బుధవారం మూలబొడ్డవరలో గ్రామసభను నిర్వహించగా 382 మంది నిర్వాసిత రైతుల్లో 198 మంది కేఆర్‌సీసీ స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ వద్ద హాజరయ్యారు. వినతులు అందించా రు. ఇందులో షేర్లు, ఉద్యోగాలు కావాలంటూ అడిగిన వారే అత్యధికం. వీటన్నిటికి పరిష్కార మార్గం చూపించి జిందాల్ భూముల్లో పరిశ్రమల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇదే జరిగితే నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందినట్లే. ఇప్పటికే కొత్తవలస, లక్కవరపుకోట మండలాల పరిధిలో పలు పరిశ్రమలు ఉన్నాయి. జిందాల్ భూముల్లోను పరిశ్రమలను నిర్మించడం ద్వారా విశాఖ-అరకు రోడ్డుతో పాటు తాటిపూడి-విజయనగరం రోడ్డు పారిశ్రామిక కారిడార్‌గా మారనుంది.

విజయనగరంలో త్రీటౌన్ స్టేషన్!

(మూడో పేజీ తరువాయి)

పోలీసుస్టేషన్లు ఉన్నాయి. తాజాగా త్రీ టౌన్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలనిప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం.ప్రభుత్వపరిశీలనలోఉంది. వన్‌టౌన్ పరిధి చాలా ఎక్కువగా ఉంది. త్రీటౌన్ ఏర్పాటు చేస్తే ప్రస్తుతం ఉన్న రెండుపోలీసు స్టేషన్లకు, అందులో పనిచేసే సిబ్బం దికి పనిభారం తగ్గుతుంది. ప్రజలకు మరింత ఎక్కువగా పోలీసు సేవలు అందుతాయి.

సాఫ్ట్‌బాల్ జూనియర్ జట్ల ఎంపిక

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ బాలురు, బాలికల జిల్లా జట్ల ఎంపికను ఈ నెల 13న ఆరకతోట లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నామని పీడీ నల్ల వెంకటనాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. క్రీడాకారులు తమ కిట్లతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు.

తుప్పలు పెరిగి.. సాగు నీరందక

● ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు ● ఇదీ వెంకటపతిరాయి చెరువు కాలువ పరిస్థితి

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.బూర్జవలస శివారున గల వెంకటపతిరాయి చెరువు నుంచి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందడం లేదు. ప్రధానంగా ఏళ్ల తరబడి పెరిగిన తుప్పలు తొలగించకపోవడంతో ఖరీఫ్‌లో సైతం అవస్థలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. చెరువు నుంచి 500 ఎకరాలకు సాగు నీరందుతోంది. కాలువల్లో తప్పులు తొలగించాలని పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా అధికారులు చర్యలు తీసుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. అలాగే రంగరాయపురంలోని గోపాలరాయునిచెరువు, అలజంగి సీతారామసాగర్ బంద పరిధిలో గల కాలువలు కూడా నిర్వహణ లేకపోవడంతో తప్పులు పెరిగిపోయాయి. దీంతో ఆయకట్టు పరిధిలో ప్రస్తుతం ఖరీఫ్‌కు సైతం నీరందని దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. కాగా ఉపాధిపథకం పనులతో కాలువలు అభివృద్ధి చేయిస్తానని ఏపీవో లక్ష్మీపతిరాజు తెలిపారు.



వెంకటపతిరాయి చెరువు కాలువలో పెరిగిన తుప్పలు

ఆటో కార్మికులను ఆదుకోండి

బొబ్బిలి/రూరల్ , సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించడంతో ఆటో కార్మికులకు జీవనోపాధి కరువైందని, తక్షణమే ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు కోరారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో బొబ్బిలిలో ఆటో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకుఏటా రూ.25వేలు నష్టపరిహారం కింద చెల్లించాలన్నారు.ఆటోకార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.అనంతరం తహసీల్దార్ శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 17న జిల్లా బంద్, 19న చలో విజయవాడ కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్మికుల ఆందోళనకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సింగి రెడ్డి గోపాలం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ.మోహనరావు, ధనంజయ, గంగరాజు, జయరాం, త్రినాథ, వీరన్న పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటో కార్మికులు



గంట్యాడ: గణేష్ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



బొబ్బిలి పట్టణంలో..



బొబ్బిలి రూరల్: కోలాటం ఆడుతున్న బాలికలు

ఘనంగా గణనాథుల నిమజ్జనం

బొబ్బిలి/ రూరల్ , సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు వీధుల్లో ఏర్పాటు గణేశ మండపాల్లోని గణనాథులకు గురువారం నిమజ్జనాల ఘనంగా నిర్వహించారు. డ్యాన్స్‌లు, కేరింతలతో యువత సందడి చేశారు. బాలికల కోలాటం ఆకట్టుకుంది. ఐటీఐ కాలనీలో గణేశ ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ సతీష్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

● గంట్యాడ: కొటారుబిల్లి కూడలిలో వినాయక నిమజ్జనం కార్యక్రమం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ఊరే గింపులో యువకులు ఉత్సాహంగా డ్యాన్సు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): కలవరాయి 33 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బొబ్బిలి నుంచి జగన్నాథపురం వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ రఘు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

భూకబ్జాదారులపై కేసులు నమోదు చేయండి

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): భూకబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ శ్రీనుకు వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం కోట అప్పన్న మాట్లాడుతూ పట్టణంలోని లక్ష్మీశ్రీనివాస జూట్ మిల్ ఇటీవల మూసేసి కూల్చేశారన్నారు. దానికి సమీపంలోని ప్రభుత్వ భూమిని జూట్ మిల్లును కొనుగోలు చేసిన వ్యక్తులు ఆక్రమణకు తెరలేపారన్నారు. గతంలో రెవెన్యూ యంత్రాంగం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును సైతం తొలగించారన్నారు. ఈ విషయం గతంలో పలుమార్లు రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో కబ్జాదారులు రెచ్చిపోయి ప్రభుత్వభూమిని చదును చేస్తున్నారన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు రాకోటి నాగమ్మ, పట్టణ సహాయ కార్యదర్శి గొల్లపల్లి తౌడు, కృష్ణ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో తేడా వస్తే సహించేది లేదు

గుర్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి విషయంలో సచివాలయ ఉద్యోగులు అశ్రద్ధ వహిస్తే ఊరుకునేది లేదని జిల్లా డివిజన్ అభివృద్ధి అధికారి హేమసుందర్ తెలిపారు. గురువారం నాగళ్లవలస పంచాయతీలో జరుగుతున్న శానిటేషన్, తాగునీటి సరఫరా విధానంపై కార్యదర్శి కళ్యాణిని అడిగి, తెలుసుకున్నారు.

నానో యూరియా వాడకంతో మేలు: ఏవో

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వాడకం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువలాభాలు పొందవచ్చని ఏవో మజ్జి శామ్‌సుందర్ వివరించారు. గురువారం కృష్ణాపురంలో రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయసహాయకురాలు స్వర్ణలత పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఫ్రీడమ్ ప్లాన్ గడువు పొడిగింపు

బొబ్బిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఎస్‌ఎన్‌ఎల్ ద్వారా ఒక్క రూపాయికే ప్రవేశపెట్టిన ఫ్రీడమ్ సిమ్ ప్లాన్‌కు వినియోగదారుల నుంచి స్పందన లభిస్తోందని ఆ సంస్థ ఎస్‌డీఈ యు.ఎలియా తెలిపారు. గురువారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ గతనెల ఒకటో తేదీ నుంచి నెలాఖరు వరకు రూ.1 ఫ్రీడమ్ ప్లాన్‌ను అమలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. వినియోగదారుల నుంచి డిమాండ్ ఉండడంతో ఈనెలాఖరు వరకు ఈ గడువును పెంచినట్లు తెలిపారు. రూ.1 సిమ్‌తో రోజుకు 2 జీబీ డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్‌ను ఉచితంగా వినియోగించుకునే వెసులుబాటు ఉందని తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

బాడంగి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బాడంగిలోని పలు ఎరువులు దుకాణాలను గురు వారం విజిలెన్స్ సీఐ బి.సింహాచలం తనిఖీలు నిర్వహించారు. రామలక్ష్మి రైతు డిపో, వాసవి ఫెర్టిలైజర్స్ షాపులను సందర్శించారు. అక్కడ రికార్డులను పరిశీలించి స్టాక్ సరిచూశారు. ఎంఆర్‌పీ ధరలకు ఎరువులను విక్రయించాలన్నారు.కృత్రిమ కొరత సృష్టిస్తేచర్యలు తీసుకుం టామన్నారు. రైతులకు తప్పనిసరిగా ఎరువులను రశీదులు అందజేయాలన్నారు. ఇందులో శ్రీవాసవి ఫెర్టిలైజర్స్ షాపులో డీఏపీకి సంబంధించి రైతులతో బయోమెట్రిక్ వేయడంలో తేడా ఉండడంతో 20 టన్నుల డీఏపీ విక్రయాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో హెచ్‌సీ కామేశ్వరరావు, పీసీ సీహెచ్.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపులోనే పంట పొలాలు

బొబ్బిలి రూరల్ , సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు భూముల్లో వరి పైరు నీటి ముంపులోనే ఉంది. వరి నారు నాలుగైదు రోజులకు మించి పొలాలు నీట మునిగితే కుళ్లిపోతుందని గోపాలరాయుడుపేట రైతులు ఆందోళనవ్యక్తం చేశారు.



గోపాలరాయుడుపేటలో నీట మునిగి పైరు

తామర చెరువు గండి పూడ్చివేత

రేగిడి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంగరాడ తామర చెరువుకు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గండిపడడంతో తాత్కాలికంగా పూడ్చారు.ఆయకట్టు రైతులు గురువారం గండిని గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ చెరువుకు ఇటీవల మడ్డువలస కాలువలతో అనుసంధానం చేశారు.ఈ నేపథ్యంలో ఇటీవల కురి సిన వర్షాలకు చెరువు గట్టు బలహీనమై ఒకచోట కోతకు గురై పెద్ద గంత ఏర్పడింది. ఆ చెరువు కింద దాదాపు 600 ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా, ఒక్కసారి రైతులు ఆందోళన చెందారు. రైతులు చల్ల భుజంగరావు, రాజాం ఏఎంసీ డైరెక్టర్ గురవాన ధనంజయ్ రావుకు సమస్యను నివేదించి అధికారులను అప్రమత్తం చేశారు. తహసీల్దార్ కృష్ణలత, ఆర్ఐ కిరణ్, ఇరిగేషన్ సిబ్బంది చెరువు గండిని పరిశీలించి, పంచాయతీ సహకారంతో తాత్కాలికంగా గండిని పూడ్చే చర్యలు చేపట్టారు. ఈ చెరువు గండి పూర్తి స్థాయి మరమ్మతులకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ తెలిపారు.



చెరువు గండిని పూడుస్తున్న దృశ్యం

యూరియా కోసం రైతుల అగచాట్లు



శృంగవరపుకోట: యూరియా కోసం క్యూలైన్‌లో ఉన్న రైతులు

లక్కవరపుకోట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు అగచాట్లు తప్పడంలేదు. కల్లేపల్లికి వచ్చిన 150 బస్తాల యూరియాను గురువారం పంపిణీ చేశారు. అయితే ఈ యూరియాను కల్లేపల్లి, రేగ, పీవీ పాలెం, ఎస్టీవీ పాలెం గ్రామాల ప్రజలకు సర్దుబాటు చేయాలి. సుమారు 400 మంది రైతులున్న గ్రామానికి 150 బస్తాలు ఎలా.. సరిపోతాయని వ్యవసాయ అధికారులను నిలదీశారు. హెచ్‌సీ పాపారావు బందోబస్తు నిర్వహించారు. ఎస్ఐ నవీన్‌పడాల్ పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. కాగా వచ్చిన స్టాకు మొత్తం ఏడు టన్నులు అందజేశామని ఏవో హరికృష్ణ తెలిపారు. గనివాడలో 10 టన్నులు, ఎల్.కోటలో 10 టన్నులు, గంగుబూడిలో 5 టన్నులు దించామన్నారు. ఇంకొంత రావాల్సి ఉందని.. త్వరలోనే వస్తుందని తెలిపారు. రైతులు సంయమనం పాటించాలని కోరారు.

● శృంగవరపుకోట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలోని ఓ ఎరువుల దుకాణం వద్ద గురువారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. రెండు లారీల్లో 534 బస్తాలు వచ్చాయని తెలుసుకున్న రైతులు పలు గ్రామాల నుంచి తరలివచ్చారు. ఒక్క బస్తా అయినా పట్టుకెళ్లాలని క్యూ కట్టారు. రైతుల మధ్య తోపులాట జరగకుండా ఉండేందుకు పోలీసులు దగ్గర ఉన్నారు.

వరదొస్తే వణుకే!


(మూడో పేజీ తరువాయి)

సమీపించడంతో పనులు చేపట్టలేదు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలయాపన చేయడంతో నిధులు మురిగిపోయాయి. దీంతో వంతెన నిర్మించకపోవడంతో వరదొస్తే ఇక్కట్లకు గురికావల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కూడా భారీగా వరద రావడంతో ఐదు గ్రామాల ప్రజలు ఇబ్బందిపడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తక్షణమే వంతెన పనులు ప్రారంభించాలని ఇటీవల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఆయా గ్రామాల ప్రజలు వినతిపత్రాన్ని అందజేశారు.

చదువుకు దూరం

ప్రతి ఏటా వర్షాకాలంలో వరద ఉధృతి ఉన్నంత కాలం విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేకపోవడంతో చదువుకు దూరమవుతున్నారు. కొందరు పురుషులు సాహసించి నడుములోతు నీటిలో దాగి దాటు తున్నారు. మహిళలు వరద సమయంలో ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఏటా వరద తగ్గే వరకూ తమకు అగచాట్లు తప్పడంలేదని వాపోతున్నారు. వర్షాకాలం వ చ్చిందంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నదిని దాటి విధి నిర్వహణకు వెళ్తున్నామని ఉద్యోగులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెననిర్మాణానికి చర్యలు చేపట్టాలని పలుగ్రామాలకు చెందిన తాడ్డి సూరి, తవిటినాయుడు, గుచ్చయ్య, చిన్నయ్య, బాలరాజు కోరుతున్నారు.

కన్నతండ్రే కాలయముడు



హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- » కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- » ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- » తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- » తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- » సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.



ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోఢా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

లోకం తీరు



కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుదిశ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

బోధనలో మేటి మాస్టార్లు

- ● ఆ ఉపాధ్యాయులది ప్రత్యేక శైలి
- ● అంకితభావంతో గుర్తింపు
- ● నేడు ఉపాధ్యాయ దినోత్సవం

సమాజంలో ఉపాధ్యాయుడిది ప్రత్యేక స్థానం. ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక గౌరవం. తమదైన బోధనా తీరుతో విద్యార్థులను తీర్చిదిద్దుతూ.. ఇటు తల్లిదండ్రుల ప్రశంసలు... అటు ప్రభుత్వ పురస్కారాలు అందుకుంటున్న వారు ఎందరో ఉన్నారు. కొందరు అవార్డులు... రివార్డులు రాకపోయినా సేవలందిస్తున్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొందరు గురువుల గురించి తెలుసుకుందాం.

ఆటపాటలతో బోధిస్తూ...



కృత్యాలతో బోధిస్తున్న ఉషారాణి

బొబ్బిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని తారకరామాకాలనీ మున్సిపల్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్న చిట్టిమోజు ఉషారాణి బోధనలో ప్రత్యేక శైలిని ప్రదర్శిస్తున్నారు. ఆటపాటల ద్వారా పాఠ్యాంశాలను బోధిస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు. మై స్మార్ట్ క్లాస్ వెబ్‌సైట్‌ను రూపొందించడంతో విద్యార్థులంతా ట్రయల్ అండ్ ఎర్రర్ మోడ్‌లో పాఠాలు నేర్చుకుంటున్నారు. మొబైల్ ఫోన్లలో అనవసరమైన వాటి నుంచి పిల్లల దృష్టిని మరల్చడానికి ఆమె ఈ విధానాన్ని ఎన్నుకున్నారు. విదేశీయులతో పాటు ఉపాధ్యాయ కోర్సులు శిక్షణ పొందుతున్న వారు సైతం ఈ వైబ్‌సైట్‌ను ఫాలో అవుతున్నారు. అక్షరమాలపై సొంతంగా పాటలు రాశారు. గత ఏడాది రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు కింద ప్రభుత్వం ఇచ్చిన రూ.20 వేల నగదుతో ప్రభుత్వ పాఠశాల విద్యా ర్థులకు కొత్తదుస్తులు అందించారు. పిల్లలకు సులభతరంగా అర్థమయ్యేరీతిలో బొమ్మలు, ప్రాజెక్టులు, పాటలు, పెయింటింగ్స్ వంటి వాటితో అర్థవంతంగా బోధిస్తున్నారు.

పుస్తకాలకే పరిమితం కాకుండా..

గరుగుబిల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థి స్థాయికి వచ్చినప్పుడే వారి మనసుల్లో నిలిచిపోతారని నమ్ముతున్నారు కొత్తూరు పాఠశాల ఉపాధ్యాయులు వంగపండు ధనుంజయ నాయుడు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు పుస్తకాలతో పాటు ఆడియో విజువల్ సాధనాలతో బోధన అందిస్తున్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను బయటకు తీసుకు రావడానికి వివిధ ప్రయోగాలు చేయిస్తుంటారు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధించేందుకు ప్రయత్నిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. విద్యార్థులతో మమేకమై బోధించడంలో ఆయన ముందు వరుసలో ఉంటున్నారు.



వంగపండు ధనుంజయనాయుడు

తెలుగుకు కళలను అద్ది...

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన... మానవీయ విలువలు ఉండాలంటారు కొమరాడ మండలం అర్తాం పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కంచుమోజు రామ్మోహనరావు. గరుగుబిల్లి మండలం చిలకాం ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఆయన ఇటీవల అర్తాం పాఠశాలకు బదిలీపై వెళ్లారు. తెలుగు భాషను కళల రూపంలో బోధించడం ఆయన ప్రత్యేకత. వివిధ కళారూపాలను విద్యార్థులకు నేర్పించి... వారికి అర్థమయ్యే రీతిలో బోధిస్తుంటారు. అవసరమైన విద్యా సామగ్రిని ఆయనే సొంతంగా సమకూర్చి.. పిల్లలకు చదువుపై ఆసక్తి కల్పిస్తారు. పాఠశాలల్లో బోధనతో పాటు పచ్చదనం పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పిస్తుంటారు. శిథిల భవనాలకు మరమ్మతులు నిర్వహించేందుకు సొంత నిధులను కేటాయిస్తుంటారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాలతో పాటు ఆధ్యాత్మిక ప్రవచనాలు, గీతా పారాయణం, భాగవత సప్తాహం వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంటారు.



కంచుమోజు రామ్మోహనరావు



ప్రొఫెసర్ రంజనా అగర్వాల్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న వేణుగోపాల్

ప్రతిభకు గుర్తింపు దక్కేలా..

రాజాం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆయనో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు. ఏ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసినా.. అక్కడి విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు కృషి చేయడం ఆయన ప్రత్యేకత. విద్యార్థులను జిల్లా, రాష్ట్ర స్థాయిలలో వివిధ అంశాలలో ప్రతిభ చూపేలా తీర్చిదిద్దుతుంటారు. విద్యార్థులకు సాంకేతికపరమైన అంశాలను వివరించడం, కొత్తదనాన్ని నేర్పించడం అలవాటుగా మార్చుకుని అవార్డుల మాస్టారుగా పేరొందారు రాజాం మండలం కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పందూరు వేణుగోపాల్. ఎం.సీతారాంపురం, వీరఘట్టం, జి.సిగడాం, పొగిరి, కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే కాలంలో విద్యార్థులతో ప్రాజెక్టులు తయారు చేయించి జాతీయ స్థాయిలో ప్రశంసాపత్రాలు, నగదు అవార్డులు పొందేలా కృషి చేశారు. సైన్స్ గైడ్‌గా 18 సార్లు జిల్లా స్థాయి, 18 సార్లు రాష్ట్రస్థాయి, 8 సార్లు జాతీయ స్థాయి, రెండుసార్లు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమాలలో ప్రాజెక్టులు ప్రదర్శింపజేశారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి కార్యక్రమంలో ప్రదర్శించిన తృణధాన్యాల ప్రాజెక్ట్‌కు రూ.50 వేల నగదు బహుమతిని దక్కించుకున్నారు. అదే ప్రాజెక్ట్‌కు పూణేలో నిర్వహించిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమంలో రూ.30 వేల నగదు బహుమతి లభించింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమంలో కంచరాం ఉన్నత పాఠశాల విద్యార్థులతో తయారు చేయించిన ప్రాజెక్ట్‌కు రూ.20 వేల నగదు బహుమతిని అందుకున్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు సులభతరంగా అనుమతులు

● జేసీ సేతుమాధవన్



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు చేసిన వారికి సులభతరంగా అనుమతులివ్వాలని, దరఖాస్తుల పరిశీలన ఉదారంగా జరగాలని జేసీ సేతు మాధవన్ తెలిపారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా గత ఏడాది 2,257 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై(ఈవోడీబీ) జేసీ ఆధ్వర్యంలో వర్క్ షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవోడీబీలో ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందుతుందని, అధికారులంతా దీనిని దృష్టిలో పెట్టుకుని పని చేయాలని కోరారు.ఈవోడీబీపై కేంద్ర ప్రభుత్వం సర్వే చేస్తుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారికి ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్ వస్తాయని, వారు అన్ని శాఖల నుంచి అందిన సహకారంపై అభిప్రాయాన్ని పాజిటివ్‌గా చెప్పాలని పేర్కొన్నారు. గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చేసుకున్న దరఖాస్తులు ఫోన్ ద్వారా అభిప్రాయాలను సేకరించనున్నట్లు తెలిపారు. అనుమతులు ఆన్‌లైన్‌లో ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతి నెల జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీలో సమీక్షించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో జిల్లా ఉత్తమ స్థానంలో ఉందని చెప్పారు. సమావేశంలో పరిశ్రమల మేనేజరు కరుణాకర్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ప్రసాదరావు పాల్గొన్నారు.



జరడ పరిసరాల్లో ఉన్న ఏనుగులు

జరడలో ఏనుగుల గుంపు

కురుపాం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల గుంపు జరడ పంచాయతీలోని వివిధ గ్రామాల్లో సంచరిస్తున్నాయి. గిరిజనులు పండిస్తున్న కొండ పోడులను ధ్వంసం చేస్తున్నాయి. జీలుగు, పనస చెట్లను నాశనం చేస్తున్నాయి. కొండ పోడుల్లో వేసిన చిరుధాన్యాలను పాడు చేస్తున్నాయి. వరి నారు మడులనూ తొక్కి పాడు చేస్తున్నాయి. దీంతో గిరిజనులు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ప్రభుత్వం ఈ సమస్యకు పరిష్కారం చూపాలని సర్పంచ్ జ్యోతి కోరారు.